క్లుప్తంగా

దివ్యాంగులకు ఉచిత వైద్య పరీక్షలు నేడు

గాజువాక: కేంద్ర ప్రభుత్వ సంస్థ అలింకో ఆధ్వర్యంలో దివ్యాంగులకు గురువారం ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్లు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. గాజువాక జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్న ఈ శిబిరంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. చెవి, ముక్కు, కన్ను, కాలు, చెయ్యి వంటి అవయవాల సమస్య ఉన్నవారికి పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి ట్రై సైకిళ్లు, కృత్రిమ అవయవాలను అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం నేడు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో 75వ వార్డు నెల్లిముక్కు రామాలయం కల్యాణ మండపంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నామని పోర్టు సీఎస్సార్ విభాగం ప్రతినిధి రమేష్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 11న దల్లివానిపాలెం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో గుర్తించిన పలువురికి ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కళ్లద్దాలు పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు.

ప్రహరీ ఎత్తు పెంపునకు వినతి



ఎమ్మెల్యే నాగిరెడ్డికి మొక్క అందిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు సీతానగరం, దుర్గవానిపాలెం సచివాలయం ప్రహరీ రెండు అడుగుల ఎత్తు పెంచాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి కోరారు. ఈ మేరకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడ ఎత్తు రెండు అడుగులు తక్కువగా ఉండడంతో సచివాలయంలో ఉన్న విలువైన వస్తువులను భద్రత లేకుండా పోయిందన్నారు. ఆకతాయిలు చేరి పరిసరాలను పాడు చేస్తున్నారన్నారు. గోడ ఎత్తు పెంచేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో సీతానగరం, దుర్గవాని పాలెం నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై మహిళల నిరసన

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సెక్టార్-1 పినమడక కాలనీ సమీపంలోని కర్రివానిపాలెం రహదారిలో యూజీడీ పైప్‌లైన్, రహదారిని ఆక్రమించి ఒక వ్యక్తి నిర్మాణం చేపడుతున్నారని గ్రామానికి చెందిన మహిళలు తెలిపారు. వారికి జీవీఎంసీ అధికారులు మద్దతుగా నిలవడం అన్యాయమంటూ నిరసన తెలియజేశారు. గతంలో యూజీడీ పైప్‌లైన్ అమర్చిన ఆవరణాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని, గతంలో వీటిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. అధికారులు స్పందించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని దానబాల అదిలక్ష్మి, ఉమ, కనకదుర్గ, సత్యవతి తదితరులు పేర్కొన్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

అగనంపూడి: కొత్త ఆలోచనలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు పోటీ ప్రపంచంలో నిలబడతారని విశాఖ స్టీల్‌ప్లాంట్ సీనియర్ మేనేజర్ జి.వి.కృష్ణారావు అన్నారు. 'వ్యవస్థాపకత, నూతన ఆలోచనలు, అవకాశాలు' పై దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కొలువులు కోసం చదవకుండా ఔత్సాహికులుగా ఎదగడానికి తగిన కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, సీఈవో శ్రీకాంత్, కో-ఆర్డినేటర్లు ఎం.శ్రీను, ఎం.శ్రీనివాస నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేడుక ఏదైనా.. చక్కని వేదిక



76వ వార్డు రామచంద్రనగర్‌లోని కమ్యూనిటీ భవనం

- వాడవాడలా సామాజిక భవనాలు, మినీ కల్యాణ మండపాలు
- జోరుగా వివాహాది శుభకార్యాలు
- సమావేశాల నిర్వహణకు అనువు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నాడు

సాధారణ ప్రజలు వివాహాది శుభకార్యాలు నిర్వహించుకోవాలంటే ఇళ్ల ముందే టెంట్లు వేసుకోవాల్సిన పరిస్థితి. అతిథులు, బంధువులు, స్నేహితులను బయటే కుర్చీలు వేసి కూర్చుబెట్టాల్సి వచ్చేది. వారికి అన్ని మర్యాదలతో ఆతిథ్యం ఇచ్చినా వారు కొంత సమయం అక్కడే గడపాలంటే ఇబ్బందిగా ఉండేది. పోనీ ఎక్కడైనా ఫంక్షన్ హాల్ తీసుకుందామంటే అద్దెలు చూస్తే హడల్. కరెంటు బిల్లు, క్లీనింగ్ చార్జీలు కలిపితే మరింత భారమయ్యేది.

సామాజిక భవనం	మినీ కల్యాణ మండపం
75వ వార్డు	75వ వార్డు
పాత అయ్యన్నపాలెం	మొల్లివానిపాలెం
రూ.10లక్షలు	రూ.16లక్షలు

నేడు

ఇప్పుడు ఇంట్లో ఏ శుభకార్యం చేయాలన్నా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పని లేదు. తమ ప్రాంతంలోనే.. ఇంటి సమీపంలోని కొత్తగా కమ్యూనిటీ హాల్స్ నిర్మించడంతో ఇబ్బందులు తొలగిపోయాయి. ఏ కార్యక్రమమైనా సజావుగా.. సంతోషంగా నిర్వహించుకుంటున్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా అన్ని సదుపాయాలతో ఉన్న ఈ కమ్యూనిటీ హాల్స్ ఉపయోగకరంగా ఉన్నాయి.



75వ వార్డు మొల్లివానిపాలెంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్



ఇది కదా అభివృద్ధి

చకచకా నిర్మాణాలు

జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పాత అయ్యన్నపాలెంలో రూ.10లక్షలతో సామాజిక భవనం, మొల్లివానిపాలెంలో రూ.16లక్షలతో మినీ కల్యాణ మండపం నిర్మించారు. 76వ వార్డు పరిధిలోని రామచంద్రనగర్‌లోని సామాజిక భవనానికి రూ.5లక్షలతో మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకువచ్చారు. నడుపూరులో రూ.11లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి.

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఉపయోగపడేలా, వారికి అందుబాటులో ఉండేలా.. అన్ని సౌకర్యాలతో ఎక్కడికక్కడ సామాజిక భవనాలు, మినీ కల్యాణ మండపాలను నిర్మించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఓణీల ఫంక్షన్, పుట్టినరోజు వంటి వేడుకలు..సభలు, సమావేశాలు సమీపంలోని హాల్లో సంతోషంగా నిర్వహించుకుంటున్నారు.

సామాజిక భవనం	
76వ వార్డు రామచంద్రనగర్	76వ వార్డు నడుపూరు
రూ.5లక్షలు	రూ.11లక్షలు

దూరాభారం తగ్గింది



మేము ఉంటున్న ప్రాంతంలో సౌకర్యాలు సరిగ్గా లేక దూరంగా ఉన్న ఫంక్షన్ హాళ్లు బుక్ చేసుకోవలసి వచ్చేది. చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు మాకు దగ్గర్లో ఉన్న సామాజిక భవనానికి మరమ్మతులు చేసి, అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడే వేడుకలు చేసుకుంటున్నాం.

–కవులూరి సత్యవతి, రామచంద్రనగర్, 76వ వార్డు

ఇబ్బంది తొలగింది



పాత అయ్యన్నపాలెంలో సామాజిక భవనం నిర్మించడం ఆనందదాయకం. గతంలో ఇక్కడ ఎటువంటి వేదిక లేక ఇబ్బంది పడేవాళ్లం. చిన్న చిన్న సమావేశాలు జరపాలన్నా కష్టమయ్యేది. ఇప్పుడు సమావేశాలతో పాటు పండగలు కూడా ఇక్కడే చేసుకుంటున్నాం.

– గొందేశి నాగిరెడ్డి, అధ్యక్షుడు, పాత అయ్యన్నపాలెం, 75వ వార్డు



76వ వార్డు నడుపూరులో నిర్మిస్తున్న సామాజిక భవనం

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

గాజువాక: సెలెస్ట్ విద్యుత్ సబ్ స్టేషన్‌లోని సీఎంఆర్ ఫీడర్‌కు శుక్రవారం నిర్వహణ పనులను నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా చినగంట్యాడ, సీఎంఆర్ ఏరియా, చైతన్యనగర్, ఎస్‌బీటీ హోటల్ ఏరియాలకు డిసెంబర్ ఒకటో తేదీన ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కర్ణవానిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో

కర్ణవానిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సుందరయ్య కాలనీ, స్వతంత్రనగర్, జీవీఎంసీ వాటర్ వర్క్ ఫీడర్లకు మెయింటెనెన్స్ పనులను శుక్రవారం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కారణంగా సుందరయ్య కాలనీ, ఆఫీషియల్ కాలనీ, శ్రీనగర్, దిబ్బపాలెం, కృష్ణదేవరాయనగర్, పాతకర్ణవానిపాలెం, స్వతంత్రనగర్, వై జంక్షన్ పోర్ట్ రోడ్ సర్దార్ నెస్ట్ ఏరియా, కేబీఆర్ పంప్ హౌస్‌కు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

భానోజీతోట సబ్ స్టేషన్ పరిధిలో

భానోజీతోట 11కేవీ లైన్లకు శుక్రవారం నిర్వహించనున్న నిర్వహణ పనుల కారణంగా సంజీవిగిరి కాలనీ, రాజీవ్‌మార్గ్, గణేష్‌నగర్, హిమాచల్ నగర్, పాత గాజువాక, కైలాసనగర్, మెహర్ నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ తెలియజేశారు.

పాలవలస ఫీడర్ పరిధిలో..

పెదగంట్యాడ: పాలవలస 11కేవీ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 1న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మద్దివానిపాలెం, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, దేవాడ, అప్పికొండ, లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్, మురుభాయ్, పాలవలస, గొల్లపేట, ఈసరపువానిపాలెం, యలమంచిలిదొడ్డి, గిన్నిపాలెం, నక్కదొడ్డి తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రహదారుల ఆధునికీకరణకు ప్రాధాన్యం

- మేయర్ హరివెంకట కుమారి
- 72వ వార్డులో రూ.2 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన



72వ వార్డులో శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: విశాఖ మహానగరంలో రోడ్ల ఆధునికీకరణకు పెద్దపీట వేశామని జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. 72వ వార్డులోని వందడుగుల రోడ్‌లో రూ.2 కోట్లతో చేపట్టనున్న రోడ్డు ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అన్ని వార్డుల్లో రోడ్లు, కాలువలు, కల్వర్టులను అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధి పనులను పూర్తి స్థాయిలో చేపట్టాలన్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షకు అనుగుణంగా విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను చేపట్టామన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, స్థానిక నాయకులు రెడ్డి జగన్నాథం, కటికల కల్పన, సత్యనారాయణ, ఆనంద్, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు ఓటే ఆయుధం



ర్యాలీలో పాల్గొన్న పరవాడ తహసీల్దార్ కనకారావు, ఎంపీడీవో హేమసుందరరావు

అగనంపూడి: దేశ భవిష్యత్తును మార్చే శక్తి ఓటుకు మాత్రమే ఉంటుందని పరవాడ తహసీల్దార్ కనకారావు, ఎంపీడీవో హేమసుందరరావు అన్నారు. లంకెలపాలెం సమీపంలోని నిస్ట్ కళాశాలలో ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తరువాత కళాశాల నుంచి లంకెలపాలెం కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ముందుగా ఆన్‌లైన్ యాప్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకునే విధానం వివరించారు. తరువాత లంకెలపాలెం జాతీయ రహదారి వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హైటెక్ ఐటీఐ ప్రిన్సిపాల్ దుర్గునాయుడు, నిస్ట్ కళాశాల డైరెక్టర్ ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

8,124 నోటీసులు వెనక్కి..



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

గాజువాక: ఓటర్ల జాబితాలపై ఇంటింటా నిర్వహించిన సర్వేలో శాశ్వతంగా వలస వెళ్లడం, ఆచూకీ లభించకపోవడంగా గుర్తించిన ఓటర్లకు ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసులు వెనక్కి వచ్చినట్లు గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేలో గుర్తించిన 10,705 మందికి నోటీసు-బీలను స్పీడ్ పోస్టులో పంపించామని, వాటిలో 8,124 నోటీసులు వెనక్కి వచ్చాయని తెలిపారు. దీనికి సంబంధించిన సాఫ్ట్ కాపీలను నాయకులకు అందజేసి, వీటిపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. 118 గృహాల్లో పది మంది కంటే ఎక్కువ ఓటర్లు 1383 మంది ఉన్నారన్నారు. వాటిని వారం రోజుల్లోగా పరిశీలించి అవసరమైన చర్యలను తీసుకుంటామన్నారు. వచ్చే నెల 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలకు ప్రతీ రాజకీయ పార్టీ అన్ని బూత్‌లకు ఒక బీఎల్ఏ చొప్పున నియమించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్లు శ్రీవల్లి, రమాదేవి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ప్లాంట్‌లో సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ డిమాండ్



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందజేస్తున్న ఇంటక్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో పెండింగ్ సమస్యల పరిష్కారానికి యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ మిత్రపక్షాలు, ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఎల్‌డీసీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ సంఘాల నాయకులతో ఉక్కు డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి.పాండే సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ మిత్రపక్షాల నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, పాడి త్రినాథ్, జి.గణపతిరెడ్డి తదితరులు మాట్లాడుతూ కంపెనీకి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు కార్మిక సంఘాలకు తెలియజేయాలన్నారు. సెయిల్ సంస్థలా కార్మికులకు వేతనాలు అందించాలన్నారు. ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వై.మస్తానప్ప, బొడ్డు పైడిరాజు, బి.ఎస్.రాజు, ప్రభాకరరెడ్డి, కొమ్ము ప్రసాద్ మాట్లాడుతూ తగ్గిపోయిన సిబ్బంది స్థానంలో వెంటనే నూతన నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మూడో బ్లాస్ట్‌ఫర్నేస్ వెంటనే ప్రారంభించాలని, కార్మికులకు గతంలో వలే ఇన్సెంటివ్ చెల్లించాలని, ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడిచేలా చర్యలు తీసుకోవాలని, డిమాండ్ చేశారు. సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో హెచ్ఆర్ సీజీఎం జి.గాంధీ, జీఎంలు కె. సంజీవరావు, బినయ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

1021వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు విషయంలో కార్మికులను రోడ్డున పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అన్యాయమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షల్లో 1021వ రోజు, బుధవారం సంస్థకు చెందిన సీవో, సీపీపీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సంపదైన విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



ఎస్సీ కాలనీ సచివాలయం పరిధిలో డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



వడ్లపూడిలో వై ఏపీ నీడ్స్ జగన్ బుక్‌లెట్స్ ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



కాపుతుంగ్లాంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేస్తున్న దేవన్ రెడ్డి



పెదపాలెంలో డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న 77వ వార్డు కార్పొరేటర్ సూర్యకుమారి

గాజువాక: సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అందుకే ప్రజలందరూ మళ్లీ ఆయనే రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని 72వ వార్డు ఎస్సీ కాలనీ సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత నాలుగున్నరేళ్ల పాలనలో అందించిన సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్సీ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజాన వెంకటరావు, వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, నాయకులు రెడ్డి జగన్నాథం, జగన్ తదితరులు పాల్గొన్నారు.

వడ్లపూడి సచివాలయ పరిధిలో..

కూర్మన్నపాలెం: సుపరిపాలన అందిస్తూ ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలని, జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 87వ వార్డు వడ్లపూడి సచివాలయం-2 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి పార్టీ జెండాను ఎగరవేశారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో వడ్లపూడి సచివాలయ పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాకముందు తలసరి ఆదాయంలో ఏపీ చాలా వెనకబడి ఉండేదన్నారు. ఆ పరిస్థితుల్లో పగ్గాలు చేపట్టి, వ్యవసాయ, పరిశ్రమ, విద్య, వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చి ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టారన్నారు. ఐదేళ్లలోనే ఇంత అభివృద్ధి చేసిన సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితే, రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందుతుందో ఆలోచించాలన్నారు. ఆయనకు అండగా నిలవాలని కోరారు. అనంతరం పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే బుక్‌లెట్లు, కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, శీరపు పాపారావు, దుగ్గపు దానప్పలు, జెర్రిపోతుల ఈశ్వరరావు, ఆడారి శ్రీను, బొండా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

కాపుతుంగ్లాంలో..

అక్కిరెడ్డిపాలెం: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. 69వ వార్డు కాపుతుంగ్లాం సచివాలయం-2లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాపుతుంగ్లాంలోని సచివాలయం-2లో లబ్ధిదారులకు రూ.14,53,83,999 అందజేశారన్నారు. వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఎగరవేశారు. సంక్షేమ పథకాల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును, బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వార్డు మహిళా అధ్యక్షురాలు కమరున్నీసా బేగం, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, నాయకులు కాకి అప్పలరెడ్డి, గొందేశి రమణారెడ్డి, సాలాపు వెంకటరావు, అంగ బాబూరావు పాల్గొన్నారు.

పెదపాలెంలో..

పెదగంట్యాడ: ఒక పక్క సంక్షేమం, మరో పక్క అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి అన్నారు. వార్డులోని పెదపాలెం సచివాలయం పరిధిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్లలో పెదపాలెం సచివాలయం పరిధిలో 17 కోట్ల ఒక లక్షా 9వేల 426 రూపాయలతో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. జెడ్సీ పి.సింహాచలం, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వాసీవా అధ్యక్షుడు పాండురంగ ప్రసాద్

అక్కిరెడ్డిపాలెం: ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్ అండ్ సీపీఆర్)పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ అన్నారు. వాసీవా భవనంలో లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్, ఇండస్ హాస్పిటల్ సౌజన్యంతో ఫస్ట్ ఎయిడ్ అండ్ సీపీఆర్‌పై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలేయ సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నందున వాటిపై కూడా అవగాహన కల్పించాలన్నారు. లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సుమన మాట్లాడుతూ విశాఖ మెడికల్ డెవలప్‌మెంట్ ఫీల్డ్‌లో శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్‌పై ఇండస్ హాస్పిటల్ సిబ్బంది డెమో నిర్వహించారు. కార్యక్రమంలో ఇండస్ హాస్పిటల్ క్రిటికల్ కేర్ ఎండీ డాక్టర్ సాయి కృష్ణ, వాసీవా కార్యదర్శి రాంప్రసాద్, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి నవీన్, ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ, లఘు ఉద్యోగ భారత్ విశాఖపట్నం అధ్యక్షుడు అట్లూరి రమేష్, ఐలా మాజీ చైర్మన్లు శేషగిరిరావు, వై.సాంబశివరావు, వాసీవా మాజీ ఉపాధ్యక్షుడు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.